

సఫాయి కార్మికుల ఆరోగ్య భద్రతకు చర్యలు

నెల్లూరు :సఫాయి కర్మచారీల ఆరోగ్య భద్రత, సంక్షేమాన్ని ఒక బాధ్యతగా భావించి పనిచేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె కార్తీక్ అధికారులకు సూచించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మాన్యువల్ స్కావెంజర్స్ యాక్ట్‌పై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ఉద్దేశ్యం కమిటీ దష్టికొచ్చిన అంశాలను సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి వివరించారు. తొలుత నగరపాలకసంస్థ పరిధిలో పనిచేస్తున్న సఫాయి కర్మచారీల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను మున్సిపల్ ఈఈ శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇన్‌చార్జి కలెక్టర్ కె కార్తీక్ మాట్లాడుతూ సఫాయి కర్మచారీల సంక్షేమానికి అన్నిశాఖల అధికారులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈలు అశోక్‌కుమార్, వెంకటరమణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చైతన్య, మహిళా పోలీసుస్టేషన్ సిఐ సిహెచ్ కష్ణారెడ్డి ఉన్నారు.

సమీక్షిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ కార్తీక్

మామిడి పండ్లకు 'హైవే' పై ఫీట్లు..!

ప్రమాదంలో వాహనదారులు - జాగ్రత్తలు పాటించకుంటే నష్టం

మామిడి పండ్ల సీజన్ రావడంతో ఉలవపాడు మామిడికి గిరాకీ పెరిగింది. ఇక్కడ పండ్లకు దేశస్థాయిలో గుర్తింపు ఉంది.. ఈ ప్రాంతానికి వచ్చే ప్రతి ఒక్కరూ మామిడి కాయలు తీసుకుంటారు. ఉలవపాడు జాతీయ రహదారి పక్కన పెద్ద ఎత్తున దుకాణాలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున దుకాణాలు రావడంతో జాతీయ రహదారిపై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వాహనాలు నిలుపుదల చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి అధికారులు, పోలీసులు ట్రాఫిక్ చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

మామిడి కాయల కోసం హైవే పై వాహనాలను నిలిపిన దృశ్యం

పజాశక్తి-ఉలవపాడు : వేసవి సీజన్ రాగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది ఉలవపాడు బంగినపల్లి మామిడి పండ్లు. ప్రాంతాలను బట్టి బంగినపల్లి లేదా బెనూష అని పిలుస్తారు. ఈ మామిడిపండు లేత బంగారు రంగు, రుచి, సువాసనతో మధురంగా ఉంటుంది. ఈ మామిడి కాయలు జిల్లా, రాష్ట్రాలు, ఖండంతరాలు దాటి ప్రయాణం చేస్తుంది. ఎంత స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఈ ప్రాంతం మామిడి పండ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తారా అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఎంతటి కఠినతరమైన పనులైనా కూడా ఈ మామిడి పండ్ల ద్వారా నెరవేరుతాయని నానుడి. పేద, మధ్యతరగతి, అన్ని వర్గాల వారికి ఈ ప్రాంతం మామిడి పండ్లు అంటే అత్యంత ప్రియం. ఈ ప్రాంతం లో ఎక్కువ శాతం రైతులు పక్వానికి వచ్చిన తర్వాతే మామిడి కాయల కోతలు కోస్తారు. కొందరు దుకాణదారులు ముందస్తు పక్వానికి రాని కాయలను కోసి కార్బైట్, ఇదిలిన్ గ్యాస్, ఏసి గదులు, ట్రే లలో ఉంచి కృత్రిమంగా పండించి సీజన్ రాకముందే ఉలవపాడు మామిడి పండ్లుగా అమ్ముతూ ఉంటారు. ఈ సీజన్ మొదలైతే పై స్థాయి అధికారులకు మామిడి కాయలు పంపించడం ఇక్కడ వారికి ఆనవాయితీ.

వందలాది కుటుంబాలకు జీవనాధారం

గత నలభై ఏళ్ల క్రితం మొదలైన ఈ పండు మామిడి దుకాణాలు ఇప్పుడు వందలాది కుటుంబాలకు జీవనాధారంగా మారింది. అప్పట్లో ఉలవపాడు - రాజుపాలెం మధ్యలో జాతీయ రహదారి ఇరువైపులా పెద్ద పెద్ద దయ్యాల మఱ్ఱిచెట్లు, నేరేడుచెట్లు కింద మినుకు, మినుకు మంటూ చిరు దీపాల వెలుగులో ఒకటి, రెండు మామిడికాయల దుకాణాలు ఉండేవి. ఇప్పుడు ఉలవపాడు ఉత్తర, దక్షిణ బైపాస్ నుండి వీరేపల్లి పొలిమేర వరకు ఇరువైపులా వందలాది దుకాణాలు పోటాపోటీగా వెలిశాయి. ఇటీవల గత కొద్ది రోజులుగా గుడ్లూరు మండలం, మోచర్ల జాతీయ రహదారి వరకు విస్తరిం చాయి. జాతీయ రహదారి పక్కన ప్రతి రోజూ లక్షలాది రూపాయల మామిడిపండ్ల క్రయ విక్రయాలు ఈ సీజన్లో జరుగుతున్నాయి. వీటి ద్వారా వందలాది కుటుంబీకులకు జీవనోపాధి లభిస్తుంది. ప్రతేడాది 3 నెలలపాటు ఈ వ్యాపారం జరుగుతుంది. దీని ద్వారా వచ్చిన ఆదాయంతోనే ఏడాది పొడుగునా చిరు వ్యాపారులకు తిండి,బట్ట లభిస్తుంది. రోడ్డుకిరువైపులా ఈమామిడి పండ్ల దుకాణాలు ఆకర్షితంగా కనబడు తుండటంతో పాటు రాత్రిళ్ల విద్యుత్ దీప కాంతులతో తిరునాళ్లను మైమరిపిస్తున్నాయి. దీంతో రాత్రి, పగలు జోరుగా వ్యాపారం జరుగుతుంటాయి. గతంలో పదుల సంఖ్యలో మొదలైన దుకాణాలు రాను రాను వందల సంఖ్యలో పోటా పోటీగా వెలిశాయి. కన్యాకుమారి నుండి కలకత్తా వరకు జాతీయ రహదారి కావడం ఇరువైపులా అందంగా మామిడి దుకాణాలు ఉండటంతో కార్లు,లారీలు, టూరిస్ట్ బస్సులు, భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనదారులు రోడ్డు పక్కనే వాహనాలను ఆపి మామిడి పండ్లను కొనుగోలు చేసి తమ తమ ఇళ్లకు, బంధువులకు,అధికారులకు సైతం తీసుకువెళ్లడం సహజం.

ప్రమాదపుటంచులలో ..

జాతీయ రహదారి కిరువైపులా విచ్చలవిడిగా వెలసిన మామిడిపండ్ల దుకాణాలతో ప్రమాదాలు కూడా విపరీతంగా జరుగుతున్నాయి. అతివేగంగా లారీలు రావడం దుకాణాల మీదకు దూసుకుపోవడంతో ప్రతేడాది కొందరు నిరుపేద దుకాణదారులు దారుణంగా మృత్యువాత పడుతున్నారు. ఇటీవల గుడ్లూరు మండలం, మాచర్ల దగ్గర జాతీయ రహదారి పక్కన మామిడిపండ్ల దుకాణాల పక్కగా వెళుతూ ఇద్దరు తల్లీ, కూతుళ్లు లారీ ప్రమాదంలో అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. మరికొందరైతే ఇవతల వైపు నుండి అవతలకి జాతీయ రహదారి దాటే క్రమంలో ఈ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. నేషనల్ హైవే అథారిటీ అధికారులు, స్థానిక పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. హైవే అధికారులు స్థానిక పోలీసులు దుకాణదారులకు అవగాహన కల్పించి జాతీయ రహదారి పక్కన కాకుండా దూరంగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం సాగించుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌ఛార్జి కలెక్టర్

వెట్టిచాకిరీ నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

వెట్టిచాకిరీ వ్యవస్థలోని కార్మికులను గుర్తించి విముక్తులను చేసేందుకు ఆకస్మిక తనిఖీలు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వెట్టి చాకిరీ చేసే కార్మికులను విముక్తి చేసేదుకు ఏర్పడిన జిల్లా విజిలెన్స్ కమిటీ తొలి సమావేశం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత వెట్టిచాకిరి నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, వెట్టిచాకిరి కార్మికులకు కల్పించాల్సిన ఉపాధి, పునరావాసంపై సాంఘిక సంక్షేమ శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధులు గంటా ప్రియాంక, శ్యామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలో ఇటుకబట్టీలు, పరిశ్రమలు, వ్యాపార దుకాణాలు, రొయ్యలు, చేపల గుంటలు, రైసుమిల్లులు, హెూటళ్ల మొదల్కెన ప్రదేశాల్లో కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు చేసి వెట్టిచాకిరి బాధితులను గుర్తించాలని, వారికి మెరుగైన ఉపాధి, సంక్షేమం అందించేందుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. సోషల్‌వెల్ఫేర్ డిడి శోభారాణి, కార్మికశాఖ ఉపకమిషనర్ వెంకటేశ్వర్లు, మహిళా పోలీస్‌స్టేషన్ సిఐ సిహెచ్ కష్ణారెడ్డి, ఎఎస్ఐ వై.శ్రీహరి, కమిటీ సభ్యులు బషీర్, సుదర్శన్, శ్వేత, సత్యవతమ్మ, పాపయ్య ఉన్నారు.

'ఫైవ్‌స్టార్ ఫైనాన్స్'

వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కలిగిరి :

ఫైవ్ స్టార్ హౌసింగ్ లోన్ ఫైనాన్స్ సంస్థ వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో కలకలం రేపింది. కలిగిరి మండలం, బొట్టు వారిపాలెం గ్రామంలో జరిగిన ఈ ఘటన, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఫైనాన్స్ సంస్థల వత్తిడి ఏ విధంగా ప్రాణాంతకంగా మారుతుందో తెలియజేస్తుంది. వివరాల మేరకు బొట్టువారిపాలెం గ్రామానికి చెందిన కొమరం రత్తయ్య (35) కల్లుగీత కార్మికుడు. ఆయనకు భార్య మాధురి, ఒక కొడుకు, ఒక కుమార్తె ఉన్నారు. అవసరాల నిమిత్తం ఆ కుటుంబం ఫైవ్ స్టార్ హౌసింగ్ నుంచి రుణం తీసుకున్నారు. గత రెండు నెలలుగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వాయిదా కట్టలేకపోవడంతో ఫైనాన్స్ నిర్వాహకులు వారి ఇంటి గోడలపై నలుపు రంగుతో ఆ ఇళ్లు ఫైవ్ స్టార్ సంస్థలో తనఖా ఉందని, ఎవరూ లావాదేవీలు జరపొద్దని రాశారు. దీన్ని అవమానంగా భావించిన తీవ్ర మనస్తాపానికి అయినా రత్తయ్య మరో మహిళ నుండి రూ.6వేలు అప్పుగా తీసుకొని ఫైనాన్స్ సంస్థకు చెల్లించారు. కానీ, ఫైనాన్స్ నిర్వాహకులు పూర్తి బకాయి కట్టాలని వేధిస్తున్నారు. ఆ వేధింపులు, అప్పుల బాధ తాళలేక రత్తయ్య ఇంట్లో ఎవరూ లేని సమ యంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వారి కుటుంబం దిక్కులేని పరిస్థితిలో పడింది. ఆయన భార్య మాధురి మతిస్థిమితం కోల్పోవడంతో, ఇద్దరు పిల్లలతో ఆ కుటుంబం పూర్తి ఆర్థిక కష్టాల్లో చిక్కుకుంది. ఫైనాన్స్ సంస్థల అమానవీయ వేధింపులు ఒక నిండు ప్రాణాన్ని బలిగొని, ఒక కుటుంబాన్ని రోడ్డున పడేశాయి.

రత్తయ్య ఇంటి గోడలపై ఫైనాన్స్ నిర్వాహకులు రాసిన రాతలు

ఆత్మహత్య చేసుకున్న కొమరం రత్తయ్య (ఫైల్)

తీసుకోవాల్సిన చర్యలు

ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. రుణ వసూళ్ల విషయంలో మానవత్వంతో వ్యవహరించేలా, వేధింపులకు పాల్పడకుండా ఉండేలా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. అప్పుల బాధతో ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడకుండా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తగిన సహాయక చర్యలు చేపట్టాలి.ఈ ఘటనపై పోలీసు విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నాం. కొమరం రత్తయ్య కుటుంబానికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించాలి.

నేడు విద్యుత్ ఉండని గ్రామాలు ఇవే..

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు మండలం పాలూరు సబ్‌స్టేషన్‌కి వెళ్లే 11 కెవి పాలూరు ఫీడర్‌లో లైనుకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించేందుకు బుధవారం ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు ఈ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుకందుకూరు అసిస్టెంట్ ఇంజనీర్ టీవి నరసింహం తెలిపారు. పాలూరు,దొండపాడు గ్రామ ప్రజలు గమనించి విద్యుత్ శాఖ కు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కోవిడ్ తీవ్రత నేపథ్యంలో యోగా దినోత్సవ కార్యక్రమాలు రద్దు చేయాలి

ముఖ్యమంత్రికి ప్రజారోగ్యవేదిక విజ్ఞప్తి

ప్రజాశక్తి-నెల్లూరు :కోవిడ్ యాక్టివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర పభుత్వం ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించ తలపెట్టిన భారీ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని రద్దు చేయడం మంచిదని, దీనిపై ప్రభుత్వం పునారాలోచన చేయాలని ప్రజారోగ్యవేదిక రాష్ట్ర కమిటీ సిఎం నారాచంద్రబాబునాయుడికి విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు మంగళవారం ఒక లేఖను పత్రికలకు విడుదల చేసింది. సుమారు 2 లక్షల మంది పాల్గొనే అవకాశం ఉన్న ఈ కార్యక్రమం కోవిడ్-19 సూపర్- స్ప్రెడర్ ఈ వెంట్ గా మారే ప్రమాదం ఉందని డాక్టరు ఎం.వి.రమణయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలో కోవడ్ యాక్టివ్ కేసులు 3, 961 నమోదు కాగా గడిచిన 24 గంటల్లో 685 కొత్త కేసులు 4 మరణాలు సంభవించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించిదన్నారు.కోవిడ్ వ్యాప్తిని నివారించడానికి ఆసుపత్రులకు తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా నాయకులు

గురుకుల పాఠశాలల్లో

మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఆవాజ్

ప్రజాశక్తి-నెల్లూరు : అక్కచెరువుపాడు వద్ద నిర్మించి ఉన్న మైనారిటీ గురుకుల పాఠశాలను మంగళవారం ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ రఫీ, షేక్ రషీద్ లు మాట్లాడుతూ జిల్లాలో మైనారిటీ గురుకుల పాఠశాల ను ఆటోనగర్ నుంచి అక్కచెరువుపాడుకు మార్చడం మంచి పరిణామమన్నారు. ఇక్కడ మూడు బిల్డింగులు నిర్మాణం జరిగే ఉంటే కేవలం ఒక్కదానిలోనే చదువు చెప్పడం హాస్టల్ గా దానినే వాడుతు న్నారన్నారు. మిగతా నిర్మాణాలు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలు పడితే భోజనాలు తినే దానికోసం మెస్స్ కెల్లాలంటే వర్షంలో తడిసి మరి భోజనం తినే పరిస్థితిని ఉందన్నారు. దీనివల్ల పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మరి కొద్ది రోజుల్లో స్కూల్ తిరిగి ప్రారంభమవుతున్నాయని ఆలోపు పూర్తిస్థాయి పనులు చేసి స్కూల్ కి చుట్టూ కాంపౌండ్ నిర్మాణం కూడా కట్టించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆవాజ్ రూరల్ అధ్యక్షులు షేక్ నజీర్, ఆవాజ్ సభ్యులు నజీర్, జావీద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పేగు వ్యాధులకు మెరుగైన చికిత్సలు

ప్రజాశక్తి-నెల్లూరు :మన జీర్ణ వ్యవస్థలో పేగులు ఆహారాన్ని జీర్ణం చేయడంలో, పోషకాలను శరీరానికి అందించడంలో, వ్యర్థాలను బయటకు పంపడంలో కీలకపాత్ర పోషిస్తాయని అలాంటి ప్రేగులను ఆరోగ్యంగా ఉంచుకుంటేనే జీవన గమనం సజావుగా ముందుకు సాగుతుందని మెడికవర్ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ కె. శ్రీధర్ రెడ్డి అన్నారు. ఇటీవల కాలంలో పేగు సంబంధిత సమస్యలతో అనేక మంది హాస్పిటల్‌కు వస్తున్న తరుణంలో పేగు వ్యాధులు రావడానికి గల కారణాలు, వాటి లక్షణాలు, చికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డాక్టర్ శ్రీధర్ రెడ్డి ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు. పేగు సంబంధిత సమస్యలు మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయన్నారు.

ఎన్‌హెచ్ 67 నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు

మెరుగైన నష్టపరిహారం అందజేయాలి

రైతు,కౌలు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు : జాతీయ రహదారి 67 నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం మెరుగైన నష్టపరిహారం చెల్లించాకే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లోని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల కార్యాలయంలో విలేకర్ల మావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత్ మాల, సాగర్ మాల పేర్లతో జిల్లాలో 108 కిలోమీటర్లలో నిర్మించనున్న రహదారికి జిల్లాలోని ఆరు మండలాల పరిధిలోని 38 గ్రామాలలో 980 ఎకరాల భూమిని అధికారులు భూ సేకరణ చేపట్టారన్నారు. భూమిని సేకరించే సమయంలో అధికారులు భూసేకరణ చట్టాన్ని ఎక్కడా అమలు చేయలేదన్నారు. రైతుల నుంచి భూమిని తీసుకోని వారికి నామమాత్రంగా నష్టపరిహారం అందజేయడం సరికాదన్నారు. ఈ నష్టపరిహారం కొన్ని మండలాలల్లోని రైతాంగానికి అధికారులు చెల్లించలేదన్నారు. భూ సేకరణ చట్టం 2013 నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే కాకుండా , రైతులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండా జాతీయ రహదారి నిర్మాణం కోసం టెండర్లను పిలవడం ఎంతవరకు న్యాయమన్నారు.ఈ సమస్యపై ఇప్పటికే పలు మార్లు జిల్లా అధికారులను కలిసి రైతుల సమస్యలను వివరించి న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసినా స్పందన లేదన్నారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి రైతులకు 2013 భూసేకరణ చట్టాన్ని అనుసరించి నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, గంటా లక్ష్మీపతి ఉన్నారు.

మాట్లాడుతున్న రైతు,కౌలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

ప్రసూతి విభాగంలో మెరుగైన సేవలందించాలి : ఐద్వా

ప్రజాశక్తి-నెల్లూరు

ఐద్వా రూరల్ కమిటీ నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసూతి చిన్న పిల్లల ఆస్పత్రి లోని వివిధ వార్డులను సందర్శించింది. మంగళవారం ఐద్వా రూరల్ కమిటీ సభ్యులు ప్రసూతి విభాగంలో చికిత్సలు పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యుల సిబ్బంది పనితీరు, ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, సిబ్బంది నుంచి అందుతున్న సేవలు సంతప్తికరంగా ఉన్నాయని, కొంత మంది చెప్పాగా మరి కొంత మంది కొన్ని రకాల మందుల ఆస్పత్రి లో అందుబాటు లేవని, అవి బయట కొనుగోలు చేయవలసి వస్తుందని తెలిపారు. ఆహారంలో నాణ్యత పెరిగితే బాగుంటుందని, మరి కొందరు మహిళలు ఈ బందం దష్టికి తీసుకొచ్చారు. ఐద్వా రూరల్ కార్యదర్శి షాహిన బేగం మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది పేద ప్రజలకు మంచి సేవలు అందించడం సంతోషంగా ఉందని, ఐతే ప్రభుత్వం అవసరమైన అన్ని మందులు అందు బాటులో ఉంచేలా చూడాలని అన్నారు. ఐద్వా రూరల్ అధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి మాట్లాడుతూ, ఆస్పత్రి లో అందుతున్న సేవల పరిశీలన కోసం తమ బందం వచ్చిందని, నాణ్యమైన ఆహారం సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బృందంలో ఐద్వా సీనియర్ నాయకులు అరిగేల రమమ్మ, షేక్ శంషాద్, జాకీర , రీజ్వాన ఉన్నారు

ప్రసూతి విభాగంలో బాలింతలతో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

బాస్కెట్ బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన బాలురు జట్టు

బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు

ఉమ్మడి ప్రకాశం జిల్లా. అండర్ -23 బాలుర. బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక జరిగింది. మొట్టమొదటి అండర్ - 23. త్రీ అండ్ త్రీ. రాష్ట్ర ఛాంపియన్షిప్ చిత్తూరులో. జూన్ 4 ,5. తేదీల్లో. జరగనున్నాయి. . ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు. బాలురు ఈ పోటీలలో పాల్గొననున్నారు.. మొట్టమొదటి. అండ్ 3. చాప్టర్ షిప్ లో పాల్గొని. బాగా ఆడి. మన జిల్లాకి. మంచి పేరు తీసు కురావాలని. ఉమ్మడి ప్రకాశం జిల్లా. బాస్కెట్బాల్ అసోసియేషన్. ప్రెసిడెంట్. వలేటి రవీంద్ర.సెక్రెటరీ. తొట్టెంపూడి సుబ్బారావు ఆకాంక్షించారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే ధర్నాలు

తెలుగు యువత రాష్ట్ర పధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్

ప్రజాశక్తి-కందుకూరు

రాష్ట్రంలో వెన్నుపోటు, గొడ్డలిపోటుకు పేటెంట్ హక్కు పులివెందుల ఎంఎల్‌ఎ జగన్మోహన్‌రెడ్డి అని తన హయం లో జరిగిన కుంభకోణాల నుంచి ప్రజల దష్టి మళ్లించడానికి వైసిపి వెన్నుపోటు యాత్రలు అంటూ హడావుడి చేస్తుందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడారు. గతంలో జగన్ సర్కార్ తమ పాలనలో తాను చెప్పిన 85శాతం హామీలకు ఎగనామం పెట్టి, తొలి ఏడాదిలో 10 శాతం హామీలు కూడా అమలు చేయకుండా 70 శాతం హామీలు అమలు చేసిన కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ప్రసాద్ అన్నారు. జగన్‌రెడ్డి మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

బెజవాడ ప్రసాద్

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి -కందుకూరు

కందుకూరు శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులతో చిత్రలేఖనం పోటీలు నిర్వమించారు. వేసవి శిక్షణలో భాగంగా ఈ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల బొమ్మలను విద్యార్థులు గీశారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్

నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం 54/4 సచివాలయం పరిధిలోని టిడ్కో గృహ సముదాయాలను సందర్శించారు. హౌసింగ్ బ్లాక్ మధ్యలో పెరిగి ఉన్న వీడ్ ప్లాంట్స్ ను క్లియర్ చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి నెల స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. పారిశుధ్యానికి సంబంధించి ఎటువంటి లోపాలు ఉన్న క్లియర్ చేస్తామని తెలిపారు. దోమల నివారణ కోసం టిడ్కో గృహ సముదాయంలో రెగ్యులర్గా ఫాగింగ్ కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

టిడ్కో గృహ సముదాయంలో మాట్లాడుతున్న అధికారులు

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్

ప్రజాశక్తి-నెల్లూరు

అరవైదేళ్లు పైబడిన వద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే రేషన్ బియ్యం అందిస్తామని ఇన్‌ఛార్జి కలెక్టర్ కె. కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. వద్ధులైన వారు రేషన్ షాప్ వద్దకు రానవసరం లేదన్నారు. వద్ధులు,దివ్యాంగుల ఇళ్ల వదద్దకు డీలర్ వచ్చి 12 గంటల నుంచి 4 గంటల లోపు ఇస్తారని తెలిపారు. జిల్లాలో 89 వేల మంది వద్ధులు,దివ్యాంగుల కార్డులు గుర్తించామని ,వాటిని మండలాల వారీగా విభజించి డీలర్లకు అందిస్తామన్నారు.

మధ్యాహ్న భోజనంకు సంసిద్ధం

ప్రజాశక్తి-వరికుంటపాడు

వారం రోజుల్లో పాఠశాలలో పునఃప్రారంభం కానున్న దృష్ట్యా విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించే విధంగా తయారు అవ్వాలని ఎంఇఒలు రమేష్, రమణయ్యలు సూచించారు. విద్యా వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తుగానే పరిసరాలు, వంట సామాగ్రి పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఎటువంటి అవకతవకలకు చోటు లేకుండా విద్యార్థులకు సమయానుకూలంగా భోజనం చేసే విధంగా సంసిద్ధులు కావాలన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేటలో కిశోర బాలికల కోసం ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ కౌమారదశలో ఉన్న వారికోసం కీలక సందేశం, నాయకత్వం అనేది పదవి కాదు. అది ఒక చర్య, ముఖ్యంగా కిశోర బాలికలను ఉద్దేశించి పరిశుభ్రత, కార్యకలాపాలపై సమాచారం వహించడం, బాలికల ఖక్కులు ఏర్పాటు గురించి ఉపాధ్యాయులతో మాట్లాడడం, బాలికల హక్కులపై పోస్టర్ తయారీ సెషన్ నిర్వహించడం, అనే విషయాలపై కిశోర బాలికలకు అవగాహన నిర్వహించారు. సమావేశంలో కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు బి.విజయలక్ష్మి, ఎ.సుశీలమ్మ, పి.సావిత్రి, జి.ఇందిర, షేక్.షాకీరాబేగం తదితరులు పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం సిద్ధనపాలెం పంచాయతీలోని గిరిజన కాలనీ చెందిన కత్తి కోటయ్య, కత్తి సులమయ్య అనే ఇద్దరి రెండు పూరి గుడిసెలు మంగళవారం అగ్నికి ఆహుతయ్యాయి. వివరాల మేరకు.. వంట వండుకుంటున్న సందర్భంలో నిప్పురవ్వలు గుడిసెకు తగులుకొని గుడిసెలు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. సమాచారం అందుకున్న రెవెన్యూ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కట్టుబట్టలు మిగిలిన రెండు గిరిజన కుటుంబ సభ్యులకు బోగోలు మండల తెలుగు యువత అధ్యక్షుడు అన్నంగి ఆదిశేషయ్య తనవంతుగా నిత్యావసర వస్తువులు కూరగాయలు కొంత నగదును అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం వారి కుటుంబాలను ఆదుకుంటుందని తెలిపారు.

రేషన్ పంపిణీ తనిఖీ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఇన్‌ఛార్జ్ తహశీల్దారు జి.వెంకటేశ్వర్లు, సిఎస్‌డిటి హాజీ ఉల్లాఖాన్ తదితర అధికారులు మండలంలోని, పలు గ్రామాలలో దివ్యాంగులకు ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని, తనిఖీ చేశారు. తదనంతరం తహశీల్దారు విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ బియ్యం అందించ బడుతుందని ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.కార్తీక్ ప్రకటనలో తెలిపారని, వృద్ధులైన వారు రేషన్‌షాప్‌నకు రావద్దని, వృద్ధులు, దివ్యాంగుల ఇంటికి డీలర్ వచ్చి 12 గంటల నుండి 4 గంటలలోపు ఇస్తారని తెలిపారు. డీలర్లు తప్పనిసరిగా వారి ఇంటికి వెళ్లి రేషన్ ఇవ్వాలని, అలా ఇవ్వలేదని ఆరోపణ వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ హెచ్చరికలు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో రేషన్‌షాప్ డీలర్లు పాల్గొన్నారు.

నేడు 'వెన్నుపోటు దినం'

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు నియోజకవర్గానికి మండల కేంద్రమైన కోవూరు పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు బజార్ సెంటర్లో ప్రారంభం అయ్యే ఈ నిరసన ర్యాలీకి నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు, ఎండీయూ వాహనాల డ్రైవర్లు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఈ నిరసన కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు నరసింహులురెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయంలో వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు బజార్ సెంటర్లో ఈ నిరసన ర్యాలీ ప్రారంభమై ఆర్అండ్‌బి అతిథి గృహం వరకు కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆనందంగా..ఆహ్లాదంగా.. వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలు ఆనందంగా ఆహ్లాదంగా పాల్గొనడం సంతోషంగా ఉందని మండల విద్యాశాఖాధికారి ఎం. దిలీప్ కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 రోజులపాటు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించడం, ఆటలు, పాటల పోటీలు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు రకరకాల కత్యాలతో లీనమవడం పట్ల గ్రంథాలయ అధికారిణి కే.మంజులతను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డి. వేణు, డ్రాయింగ్ మాస్టర్ డి. శేషయ్య, పద్మశాలి కార్పొరేషన్ సభ్యులు తాళ్ల నరసింహ స్వామి, విద్యార్థులు, పాలకులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల బెడద నుంచి రక్షించాలి..

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలో రోజురోజుకు పెగుతున్న కోతులు, వీధికుక్కల నుండి పట్టణ ప్రజలను కాపాడాలని మంగళవారం ఇఒపిఆర్‌డి కరిముల్లాకు టిడిపి నాయకులు గాజుల షర్ఫుద్దీన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు గణనీయంగా కోతులు పెరుగుతున్నయని అధికంగా వీధి కుక్కల గుప్పులతో చిన్నారులు వృద్ధులు వాహన దారులు స్కూలుకు పోవాలన్న వాహనాలు నడపాలన భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులను స్కూలుకు పంపాలంటే వీధి కుక్కలతో ఏ క్షణం ఏం జరుగుతుందో అన్న భయంతో స్కూలుకు పంపాల్సిన పరిస్థితి ఎదురవుతుందని చిన్నారుల తల్లులు ఆవేదన చెందుతున్నారన్నరు. వీధుల్లో వాహనదారులు నడిపే సమయంలో వెంబడించి గాయపరుస్తున్నాయని వాహనదారులు బెంబేలెత్తున్నార న్నారు. చిరు వ్యాపారుల సైతం కోతుల బెడదలతో భయభ్రాంతులకు గురవుతున్నా రన్నారు. వీధుల్లో మహిళలు చిన్నారులపై దాడులకు పాల్పడుతున్నాయని వెంటనే వీటిపై నివారణ చర్యలు తీసుకొని పట్టణ ప్రజలను వాటి దాడుల నుండి కాపాడాలని కోరారు.

అమృత్ పథకంలో భారీస్థాయి అవినీతి

- జర్నలిస్టులను అడ్డం పెట్టి, అమృత్ పైలాన్ విధ్వంసం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రవేశపెట్టిన అమృత్ పథకం పనుల్లో భారీ అవినీతి చోటు చేసుకుందని, కోట్ల రూపాయలు దిగమింగారని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. జూన్ 4వ తేదీకి ఎంఎల్ఏగా గెలిచి సంవత్సరం అవుతున్న సందర్భంగా మంగళవారం ఆయన వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పురప్రముఖులు, వివిధ వర్గాల వారికి ఏడాదిలో జరిగిన అభివృద్ధి, గత ఐదేళ్ల కాలంలో జరిగిన విధ్వంసంపై కావలి పట్టణంలోని దొడ్ల మనోహర్ రెడ్డి కళ్యాణ మండపంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అమృత్ పథకం పైలాన్ కూల్చబోతున్నారన్న సమాచారం ఉందని, కూల్చవద్దని, మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, అప్పటి డిఎస్‌పి, కమిషనర్, తహశీల్దార్‌లకు ఏప్రిల్ 10, 2020న జర్నలిస్టులు అందజేసిన లేఖను, అదే రోజు మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి జూన్ 12వ తేదీన ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తానని తెలిపిన వీడియో, 11వ తేదీ రాత్రి జరిగిన విధ్వంసం, మందాడి చెరువులో వాటి శిథిలాల వీడియోను ఈ సందర్భంగా బహిర్గతం చేశారు. పైలాన్ స్థలంలో "ప్రెస్ క్లబ్" వద్దని జర్నలిస్టులు వారించినా మాజీ ఎంఎల్ఎ పెడ చెవిన పెట్టారని, 11వ తేదీ అర్ధరాత్రి కూల్చి, 12వ తేదీ ఆ స్థలంలో శంకుస్థాపనకు రావడం కూడా జరిగిన విషయాన్ని మాజీ ఎంఎల్ఎ ముఖ్య అనుచరుడు, మాజీ ఎఎంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి తెలిపిన వీడియోను ఈ సందర్భంగా ప్రదర్శించారు. పైలాన్‌లో జరిగిన అవినీతి కనబడకుండా ఉండటానికి, జర్నలిస్టులను అడ్డు పెట్టుకొని ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేస్తానని వారి నమ్మించి, వారిని మోసం చేయడం జరిగిందన్నారు. ఈ కూల్చివేత విషయంలో జర్నలిస్టులు మౌనంగా ఉండటంతో అప్పట్లో ఏ పేపర్, టీవీలలో ఈ వార్త వెంటనే రాలేదని తెలిపారు. ప్రభుత్వ ఆస్థి అయిన పైలాన్ ధ్వంసం అయితే ఆ పైలాన్‌ను "ఆఫ్ట్రాల్" అంటూ ప్రతాప్‌రెడ్డి మాట్లాడాటం దుర్మార్గమన్నారు. రూ.57.92 కోట్లతో అమృత్ పథకం టెండర్లను కెఎస్ఎల్ఆర్ కంపెనీ దక్కించుకుందని, ట్యాంకులు మాత్రమే కట్టారని, 160 కిలోమీటర్ల పైప్‌లైన్లకు గానూ 83 కిలోమీటర్ల పైప్ లైన్ వేయకుండా రూ.13కోట్లు దోచుకున్నారని, ఈ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్ళాయో నిజం బయటకు రావాలన్నారు. పైప్‌లైన్ వేయకుండా తాగు నీటి కొరత సృష్టించడం ద్వారా గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లు నీటి ట్యాంకర్లతో రూ.9.55 కోట్ల నిధులు వెచ్చించడం జరిగిందన్నారు. పనులు జరగకపోవడం వలన అమృత్ పథకం క్రింద ప్రజల నుండి వసూలు కావాల్సిన నీటి పన్ను 4.51కోట్లు కోల్పోవలసి వచ్చిందన్నారు. దాని వల్ల రూ.27 కోట్ల తాగునీటి భారం మున్సిపాలిటీపై పడిందన్నారు. అమృత్ పథకానికి మున్సిపాలిటీ రూ.51.92 కోట్ల రుణాలుతెచ్చిందని, అసలు తీర్చకపోగా ఇప్పటికీ వడ్డీ చెల్లిస్తుందన్నారు. మున్సిపల్ ఎన్నికలు జరగకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేదని తెలిపారు. కావలి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగితే కౌన్సిల్‌కు అన్నీ తెలుస్తాయని, ఎన్నికలు జరగకుండా చేసిన ఘనత మాజీ ఎంఎల్ఎ ప్రతాప్‌రెడ్డిదన్నారు. ప్రెస్ క్లబ్ కోసం అమృత్ పైలాన్ ధ్వంసం చేసిన ఐదేళ్లలో పైలాన్ ఎందుకు కట్టించలేక పోయాడని ప్రశ్నించారు. ఇదే అమృత్ పైలాన్‌ను తనసొంత నిధులతో శంకుస్థాపన చేసి నిర్మిస్తాని తెలిపారు. 94శాతం అమృత్ పథకం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారని, కానీ పనులు మాత్రం చేయలేదని, దోషులను శిక్షించేందుకు విజిలెన్స్ కమిటీ వేద్దామా.. అని ప్రజలను ప్రశ్నించారు. నీటి శుద్ధి ప్లాంట్ 84శాతం పూర్తి చేశారని చెబుతున్నా పనులు చేయలేదని, ఇక్కడా డబ్బులు దోచేశారని తెలిపారు. ఉదయగిరి రోడ్డులోని జాతీయ రహదారిపై మున్సిపాలిటీ సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుంచి వచ్చే పైప్‌లైన్ ధ్వంసం చేశారని, దాని విలువ రూ.7.40 కోట్లు అని, ఎలాంటి నష్ట పరిహారం జాతీయ రహదారి సంస్థ నుండి రాబట్ట కుండా కాంట్రాక్టర్లతో మాజీ ఎంఎల్ఏ కుమ్మక్కయ్యాడని మండిపడ్డారు. దానిని ప్రస్తుతం రికవరీ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఒక్క తాగునీటి పథకంలోనే రూ.35 కోట్ల రూపాయలు అవినీతి జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో కావలి నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని తెలిపారు. ఏడాదిలో జరిగిన అభివృద్ధిని ఎంఎల్ఏ వివరించారు. కావలి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, కావలిని కాపు కాస్తానని ఎంఎల్ఏ క్రిష్ణారెడ్డి తెలియజేశారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి

కార్యక్రమానికి పాల్గొన్న నాయకులు, తదితరులు

మాజీ ఉపరాష్ట్రపతికి ఎంఎల్ఎ కాకర్ల ఆహ్వానం

ప్రజాశక్తి - ఉదయగిరి

మెట్టప్రాంత ఆరాధ్య దైవం నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కుటుంబ సమేతంగా రావాలని ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా హైదరాబాదులోని జూబ్లీహిల్స్‌లో ఆయన నివాసంలో ఎంఎల్ఎ కాకర్ల సురేష్, నర్రవాడ మాజీ సర్పంచ్ మల్లంపాటి గురవయ్య నాయుడు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోతవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెండు గంటల పాటు సుదీర్ఘంగా దేశ, రాష్ట్రాల రాజకీయాలు, ఉదయగిరి అభివృద్ధిపై ఎంఎల్ఎకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఉదయగిరి అభివృద్ధికి ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తానని, ఎప్పుడు ఎలాంటి అవసరం ఉన్న తనకు తెలపాలన్నారు. ఉదయగిరి ప్రాంతం పాతతరం నాయకుల పేర్లతో సహా తెలియజేసి వారందరిని అడిగినట్లు తెలిపారని అందరినీ కలుపుకొని పోతూ ఉదయగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని వెంకయ్య నాయుడు ఆకాంక్షించారన్నారు.

5న ప్రత్యేక గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

రాష్ట్ర ప్రభుత్వం వారు తలపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు వారి వారి సమస్యల కోసం 5వ తేదీ అనగా గురువారం రోజు ప్రత్యేక గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ తహశీల్దారు జి.వెంకటేశ్వర్లు పత్రికాముఖంగా తెలియజేశారు. తహశీల్దార్ వారి కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్‌లో కచ్చితంగా మండలంలోని అధికారులు అందరూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరు కావాల్సిందేనని తెలియజేశారు. మండలంలోని అందరూ అధికారులు గ్రీవెన్స్‌డే రోజు అందుబాటులో ఉంటారు కనుక మండలంలోని ప్రజలు, రైతులు వారి భూమి, ఇతర భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా దరఖాస్తు చేసుకొని నిర్ణీత కాలవ్యవధిలో సమస్యలను పరిష్కరించు కొనగలరని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

మాట్లాడుతున్న తహశీల్దారు సోమ్లానాయక్

చెర్లోయెడవల్లిలో తహశీల్దారు పర్యటన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరులో మే 1వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించిన సందర్భంలో ప్రభుత్వం రూపొందించిన బంగారు కుటుంబం అనే పథకం ద్వారా ఎంపికైన ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి గ్రామానికి చెందిన జ్ఞానమ్మ అనే గిరిజన కుటుంబాన్ని ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ సోమ్లా నాయక్ మాట్లాడారు. మంగళవారం గ్రామంలో రెవెన్యూ సిబ్బంది, స్థానిక గ్రామస్తులతో కలసి ఆయన పర్యటించారు. జ్ఞానమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్న మార్గదర్శి సాహెూ ఫౌండేషన్ నిర్వాహకులు నాగేశ్వరరావు జ్ఞానమ్మ కుటుంబ అభివృద్ధి కోసం మేకలు మేపుకునేందుకు కోరిన పిమ్మట లక్ష రూపాయలు నగదును అందించిన విషయం తెలిసిందే. ఆ మేకలను అందించే క్రమంలో వారి ఇంటి నిర్మాణానికి కేటాయించిన స్థలం, మేకల దొడ్డి నిర్మాణం కావాల్సిన స్థలాన్ని తహశీల్దారు పరిశీలించారు. ఈ విషయాన్ని ఇతర అధికారులతోనూ మాట్లాడి ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావనితో చర్చించి వారి సూచనలతో జ్ఞానమ్మ ఇంటికి, మేకల దొడ్డి నిర్మాణానికి అనువైన స్థలాన్ని నిర్ధేశిస్తామని తహశీల్దార్ సోమ్లా నాయక్ తెలిపారు.

ప్రతిరోజూ నివేదికలు పంపాలి

ప్రజాశక్తి-కోవూరు

గృహ నిర్మాణాలు మరింత వేగవంతం అయ్యేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చొరవ తీసుకోకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని సచివాలయాలకు సంబంధించిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు గృహ నిర్మాణ శాఖ డీఈ వెంకటేశ్వర్లురెడ్డితో కలిసి ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గృహ నిర్మాణాలకు నిధులు పెంచిన నేపథ్యంలో దీనికి సంబంధించి మొత్తం మండలంలో 490 గృహాలు ఉన్నాయని, ఈ నిర్మాణాలు వేగవంతం చేయడమే కాకుండా 88 ఉన్నాయని, వీటన్నింటినీ జూన్ 12వ తేది లోగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.

ఆరోగ్యానికి యోగా అవసరం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఆరోగ్యకరమైన జీవితానికి ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ముందస్తు ఏర్పాట్లలో భాగంగా మంగళవారం మండలంలోని మైపాడు సముద్ర తీరంలో యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డితో పాటు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కార్తీక్, ఆర్‌డిఒ పావని విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ నిత్యం ఆరోగ్యంగా ఉండాలంటే మన జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు యోగా గొప్ప సాధనమన్నారు. చిన్న వయస్సు నుండే యోగా సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అదేవిధంగా వయసుతో నిమిత్తం లేకుండా అన్ని వయస్సుల వారు చక్కగా ఆచరించగలిగిన అత్యుత్తమ సాధనం యోగా అని అన్నారు. ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో యోగాంధ్రలో ఇప్పటివరకు జిల్లాలో 8లక్షల మంది నమోదు చేసుకోవడం సంతోషకరమని, వారిలో కనీసం 75శాతం మంది తర్వాతి రోజుల్లో కూడా యోగాను కొనసాగిస్తే, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ముఖ్యమంత్రి కోరిక నెరవేరుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమం గ్రామస్థాయికి చేరినప్పుడే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యోగాంధ్ర స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితాల్లో భాగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ ఆరోగ్యంతో కూడిన అందమైన జీవన విధానానికి యోగా మంచి సాధనమన్నారు. సామూహిక వ్యాధుల నిరోధానికి యోగా పరిష్కారమన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో జిల్లాలో ఇప్పటివరకు 8లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. 124 మంది మాస్టర్ ట్రైనీలను గుర్తించామని, అలాగే 7వేలమంది సాధారణ శిక్షకులను గుర్తించామన్నారు. వీరి ఆధ్వర్యంలో గ్రామ, వార్డు స్థాయిల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు ఈరోజు నుండి ప్రారంభమవుతాయన్నారు. ప్రతిగ్రామంలో ప్రజలు ఈ యోగా సాధన కార్యక్రమంలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. ఇప్పటికే యోగాపై గ్రామస్థాయిలో వివిధ పోటీలు నిర్వహించామని, మండల స్థాయిలో పోటీలు ఈరోజు నుండి ప్రారంభమవుతాయన్నారు. యోగాను అందరికీ చేరువ చేయాలనే ప్రయత్నానికి తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన శాసనసభ్యులు ప్రశాంతిరెడ్డికి తమ ధన్యవాదాలన్నారు. కార్యక్రమంలో టూరిజం ఆర్‌డి రమణ ప్రసాద్, జెడ్‌పి సిఇఒ విద్యారమ, డిఆర్‌డిఎ, డ్వామా పిడిలు నాగరాజ కుమారి, గంగాభవాని, జిల్లా టూరిజం అధికారి ఉషశ్రీ, డిటిసి చందర్, డి ఎస్‌డిఒ యతిరాజ్, సెట్నాల్ సిఇఒ నాగేశ్వరరావు, యోగా మాస్టర్ స్వప్న, యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం చేస్తున్న ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

జిల్లా మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఆటో కార్మికుల సంక్షేమం అభివృద్ధి కోసం నిర్వహించే 6వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కోలగట్ల సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని జగదేవి పేటలో ఆటో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 21మందితో మండల ఆటో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ అధ్యక్షులుగా మనోహర్‌ను కార్యదర్శిగా అశోక్, గౌరవాధ్యక్షులుగా చాంద్‌బాషాను ఆటో యూనియన్ సభ్యులు ఎంపిక చేశారు. అనంతరం సభను ఉద్దేశించి కోలగట్ల సురేష్ మాట్లాడుతూ గత 24 సంవత్సరాల నుండి ఆటో కార్మికుల సంక్షేమం అభివృద్ధి కోసం ఆటో కార్మికసంఘం అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వాలు ఆటో కార్మికులపై చలానా, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేటు పెనాల్టీ రూపంలో కార్మికులను దోచేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రమాదాలు సంభవిస్తే డ్రైవర్లను బాధ్యులను చేస్తూ జైలు పాలు చేయడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం ఏకీభవిస్తూ ఎఫ్సీలు, డ్రైవింగ్ లైసెన్సుకు సంబంధించి ట్రాకింగ్ సిస్టం తెచ్చి కార్మికులను పూర్తిగా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఆటో కార్మికులకు ఎటువంటి సంక్షేమాన్ని ఏర్పాటు చేయకుండా కార్మికులపై అధిక భారాలను అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం మోపుతుందన్నారు. వీటికి వ్యతిరేకంగా జూలై 1వ తేదీన బుచ్చిరెడ్డిపాలెంలో నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో 6వ జిల్లా మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు అధ్యక్షులు టివివి ప్రసాద్, ఆటో యూనియన్ సంఘం కార్యదర్శి మారు బోయిన రాజా, నగర కార్యదర్శి పిడుగు మురళి, సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, ప్రభాకర్ రెడ్డి, ఆటో కార్మిక సంఘం నాయకులు చాన్‌భాషా, మనోహర్, దయాసాగర్, వాసు, అశోక్, మస్తానయ్య, ప్రతాప్, ప్రసాద్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వక్తలు

ఆర్‌టిసి బస్సు అద్దాలు పగులగొట్టిన దుండగులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక బస్టాండ్ సెంటర్లో రాత్రి నైట్ హాల్ట్ బస్సు అద్దాలను రాత్రి నిద్రపోయిన తర్వాత మద్యం మత్తులో ముందు పక్క ఉన్న అద్దాలను నాపరాయితో పగలగొట్టారని డ్రైవర్ పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ విషయాన్ని అధికారులు గుర్తించి, ఇకనైనా రాత్రి సమయాల్లో మందు బాబుల ఆగడాలను తగ్గించాలని కోరుతున్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి పనులు పరిశీలన

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం ముసునూరు రాఘవేంద్ర కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులను కావలి ఎంఎల్ఏ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. మొదటి లైన్‌పై పట్టాలను తొలగించి, బాక్స్ బ్రిడ్జి ఏర్పాటుకు అధికారులు పనులు ప్రారంభించారు. బ్రిడ్జి పనులను త్వరితి గతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని రైల్వే అధికారులను ఎంఎల్ఏ కోరారు.

రూ.5లక్షల బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-కావలి

మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం సమీపంలో సోమవారం సాయంత్రం ఆర్.ఆర్.ఆర్. కళ్యాణ మండపంలో జనసేన పార్టీ ఎంఎల్‌సి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు, ఎంఎల్‌సి, చీఫ్ విప్ హరిప్రసాద్ చేతులమీదుగా టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ సహాయ సహకారాలతో, జిల్లా కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో రూ.5లక్షల బీమా చెక్కును, కావలిలోని జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు కోలా కమలేష్ అమ్మ కోలా లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో జనసేన వాలంటీర్, కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి తోట శరణ్, జనసైనికుడు యనమల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అనంతసాగరం

స్థానిక గ్రంథాలయం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం అనంతసాగరం సచివాలయం -1 విద్య, సంక్షేమ సహాయకులు మురళి, ఇంజనీరింగ్ సహాయకులు శ్రీనివాసులు పాల్గొని విద్యార్థులకు యోగా ప్రాధాన్యతను అవసరాన్ని తెలియజేసి యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. అనంతరం యుటిఎఫ్ ఉపాధ్యాయులు షేక్ రహమతుల్లా విద్యార్థులకు వినోద హాస్య భరిత కథలను తనదైన శైలిలో బోధించి ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో స్థానిక యువకుడు మెట్టుకూరు వసంతకుమార్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : రోజూ ధ్యానం చేయడం వలన ఒత్తిడి దూరమవుతుందని యోగా శిక్షకులు తెలిపారు. యోగాంధ్ర- 2025లో భాగంగా కోవూరు' మండలంలోని అన్ని సచివాలయల్లో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేయడం వలన శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని వెల్లడించారు. యోగా సాధనతో మానసిక ఒత్తిడి నుంచి బయట పడవచ్చని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఉద్యోగంలో పని ఒత్తిడి అధిగమించి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలంటే యోగా 'మంచి మార్గమని సూచించారు. యోగా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఆయా సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులు ఉన్నారు.

In the Court of the Principal District Judge : Nellore

I.A.No. 34 / 2024
A.S.No. / 2024

1. Sikharam Venkata Subbu Narasimham
2. Sikharam Chandrasekhar (Died on 10-06-23)
3. Sikharam Lakshmi Kumari
4. Sikharam Meenakshmi Rishik
5. Sikharam Somanath (Appellants 4 and 5 being minors rep. by mother and natural guardian 3rd Appellant)
6. Sikharam Amrutavalli
- Petitioners /Appellants

Vs

1. Korrapati Masthanaiah and 6 others - Respondents / Respondents

Notice to 2nd Respondent

Muddanuru Sajeevaraju, S/o not known, residing C/o Rudraraju Subbamma, W/o Venkataraju, simhapuri centre, vedayapalem, A.K.Nagar Post. Nellore City.

పై నెంబరు గల పిటిషన్‌లో 2వ పిటిషనరు అయిన శిఖరం చంద్రశేఖర్ చనిపోయినందున, 3, 4, 5 మరియు 6 పిటిషనర్లును ఆయన వారసులుగా చేర్చమని కోరుతూ పై తెలిపిన కోర్టులో వారసుల పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసు నిమిత్తం **తే17-06-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పిడూరు నాగేశ్వర రావు, బి.ఎస్‌సి., బి.ఎల్.,
పిటిషనర్లు తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the Principal District Judge : Nellore

Arbitration O.P.No.381/2024

The National Highway Authority of India, Represented by Project Director, Tirupati PIU, Tirupati, Tirupati District. - Petitioner

Vs

1. Arbitrator & District Collector, Nellore District, Nellore.
2. The Competent Authority (Land Acquisition) & Revenue Divisional Officer, Nellore.
3. Sri Sakevari Mahesh, Aged 57 Years, Occ: Agriculture, S/o **Nagaraju,** R/o Near Temple, Gonupalli, Rapur Mandal, SPSR Nellore Dist. AP.
- Respondents

Notice to 3rd Respondent

Sri Sakevari Mahesh, Aged 57 Years, Occ: Agriculture, S/o **Nagaraju,** R/o Near Temple, Gonupalli, Rapur Mandal, SPSR Nellore Dist. AP.

పైన తెలిపబడిన పిటిషనరు ఆస్థి షెడ్యూలు సంబంధించిన సర్వే నెం.378-11B, గోనుపల్లి గ్రామం సంబంధించి Arbitration Order ద్వారా పెంచిన Compensation చెల్లదని పై తెలిపిన కోర్టులో మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు A.O.P లో మీకు నోటీసు నిమిత్తం **తే25-06-2025ది** నకు వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ, మీ వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
నేషనల్ హైవే తరపు న్యాయవాదులు
ఎం.ఆనంద కుమార్
డి.మల్లిఖార్జున రావు
పి.వంశీనాథ్